# డ్యాన్స్‌లో మేటి.. స్టెప్పుల్లో వెరైటీ...

## విభిన్న వేషాలు, నృత్యాల్లో రాణిస్తున్న వాడపల్లి యువకుడు

- గురువు లేకుండానే స్వతహాగా డ్యాన్స్ నేర్చుకున్న సమీర్
- సినీ ఆడియో లాంచ్‌లో ప్రోగ్రామ్‌లతో గుర్తింపు
- సినీ కొరియోగ్రాఫర్ కావాలనేదే తన లక్ష్యమంటున్న సమీర్



నా ఆట - నా పాట పోటీల్లో సమీర్ ప్రదర్శన (ఫైల్)

**డ్యాన్స్ అంటే ఆ యువకుడికి ప్రాణం.. వెరైటీ స్టెప్పులు అతని స్పెషాలిటీ. నిత్యం కొత్త స్టెప్పులు, విభిన్న వేషాలతో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నాడు. కళాకారుడైన తన తండ్రి నాటకాలు చూసి డ్యాన్సర్ కావాలనుకున్నాడు. అదే లక్ష్యంతో సినిమాలు, టీవీ ప్రోగ్రామ్‌లు చూస్తూ గురువు లేకుండానే స్వతహాగా ప్రాక్టీస్ చేసి డ్యాన్స్‌లో ప్రావీణ్యం సంపాదించాడు. టీవీ షోలు, సినీ ఆడియో లాంచ్ ప్రోగ్రామ్‌లలో సైతం రాణిస్తూ శభాష్ అనిపించుకుంటున్నాడు దామరచర్ల మండలం వాడపల్లి గ్రామానికి చెందిన సమీర్.**

*– దామరచర్ల, డిసెంబర్ 16*

వాడపల్లి గ్రామానికి చెందిన ఎండీ ఇనాయతుల్లా, వహీదున్నీసాబేగం దంపతుల కుమారుడు సమీర్‌కు చిన్నప్పటి నుంచి డ్యాన్స్‌పై మక్కువ ఉండేది. డ్యాన్స్‌లో రాణించడానికి అతని తండ్రి ఇనాయతుల్లా ఆదర్శం. మంచి కళాకారుడు అయిన ఇనాయతుల్లా ప్రదర్శించే నాటకాలను చూసి వెరైటీగా డ్యాన్స్ ప్రాక్టీస్ చేసేవాడు. సినిమాలు, టీవీ ప్రోగ్రామ్‌లు తిలకించి గురువు లేకుండా స్వతహాగా డ్యాన్స్ నేర్చుకున్నాడు.

### వెరైటీ స్టెప్పులు సమీర్ స్టైల్

సమీర్ అందరిలా కాకుండా నిత్యం డ్యాన్స్‌లో కొత్తదనం, వెరైటీ స్టెప్పులను వెతుకుతాడు. దీంతోపాటు హాలో మ్యాన్, డెవిల్, డబుల్ హెడ్, ప్రేమ పిచ్చోడు వంటి వేషాలతో డ్యాన్స్‌లు వేసి అందరినీ మెప్పించి శభాష్ అనిపించుకున్నాడు. అతని డ్యాన్స్ చూసిన అనేక మంది సినీ కళాకారులు అభినందించారు. డ్యాన్స్ పోటీల తోపాటు పలు గ్రామాల్లో డేర్ టూ డ్యాన్స్ పేరుతో నృత్య పాఠశాలను ఏర్పాటు చేసి చిన్న పిల్లల నుంచి పెద్ద వాళ్ల వరకు డ్యాన్స్ నేర్పుతున్నాడు. పిల్లల్లో నైపుణ్యతను పెంచుతూ పోటీలకు పంపుతున్నాడు.

### వరించిన బహుమతులు..

మండలంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో రెండో తరగతి చదువుతుండగా నిర్వహించిన ఫంక్షన్‌లో సమీర్ డ్యాన్స్ వేసి అందరినీ మెప్పించాడు. అప్పటి నుంచి అతనిలో మరింత పట్టుదల పెరిగింది. డ్యాన్స్‌లో రాణిస్తూ ఎక్కడ పోటీలు నిర్వహించినా పాల్గొనే సమీర్ ప్రేక్షకుల మన్ననలు పొందడంతోపాటు ఏదో ఒక బహుమతి సాధించేవాడు. నల్లగొండలో నిర్వహించిన పోప్ పాల్ 6వ జూనియర్ డ్యాన్స్ పోటీల్లో మొదటి బహుమతి గెలుచుకున్నాడు. పాఠశాల స్థాయిలో 20 అవార్డులను దక్కించుకున్నాడు. కాలేజీ స్థాయిలో హైదరాబాద్, గుంటూరు జిల్లాల్లో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో అనేక అవార్డులు పొందాడు. 2004లో వినుకొండలో నిర్వహించిన నా ఆట - నా పాట కార్యక్రమంలో, 2011లో కారంపూడిలో, 2014లో కోదాడలో నిర్వహించిన రాష్ట్రస్థాయి డ్యాన్స్ పోటీల్లో మొదటి స్థానంలో నిలిచాడు.

### టీవీ కార్యక్రమాలు, ఆడియో లాంచ్‌లో ప్రోగ్రామ్స్

కొత్త సినిమాల ఆడియో లాంచ్ ప్రోగ్రామ్‌ల్లో సమీర్ డ్యాన్స్ ప్రదర్శించేవాడు. పాండవులు సినిమా ఆడియో లాంచ్‌లో సమీర్ చేసిన డ్యాన్స్ అందరినీ అలరించింది. వీటితోపాటు డ్యాన్స్ బేబీ డ్యాన్స్, ఆట వంటి టీవీ కార్యక్రమాల్లో పాల్గొని ప్రతిభ చాటాడు. గ్రామాల్లో నిర్వహించే మ్యారేజ్ ఈవెంట్స్, వినాయక చవితి, జాతర్లలో డ్యాన్స్ ప్రోగ్రామ్‌లు నిర్వహిస్తూ అందరితో మెప్పు పొందుతున్నాడు. రవీంద్ర భారతీలో గత ఏడాది ప్రదర్శించిన నృత్య రూపకానికి మొదటి బహుమతి లభించింది.

### జబర్దస్ కళాకారులతో ప్రదర్శనలు..

ఒక టీవీ చానల్‌లో ప్రసారమవుతున్న జబర్దస్త్ కార్యక్రమంలోని కళాకారులతో కలిసి తమిళనాడు, ఆంధ్రా రాష్ట్రాల్లో పలు ఈవెంట్లలో సమీర్ పాల్గొన్నాడు. వారి ప్రోత్సాహం, సహకారంతో ఏడాదికి సుమారు 40 నుంచి 50 ఈవెంట్లల్లో పాల్గొంటున్నాడు. ఒక్కో ఈవెంట్‌కు రూ.40వేల వరకు తీసుకుంటున్నాడు. ప్రస్తుతం సమీర్ మండలంలోని ఒక సిమెంటు కర్మాగారంలో పని చేస్తూనే మరోపక్క డ్యాన్స్ ప్రదర్శనలు ఇస్తున్నాడు. సమీర్‌కు ప్రత్యేకంగా ఆర్కెస్ట్రా ఉన్నది. డ్యాన్స్ ప్రోగ్రామ్స్ ద్వారా మరో 10 మంది కళాకారులకు ఉపాధి చూపిస్తున్నాడు.



డబుల్ హెడ్ వేషంలో సమీర్

### సినీ కొరియోగ్రాఫర్ కావాలని ఉంది

గురువు లేకుండా సొంతంగా డ్యాన్స్ నేర్చుకున్నా. ఇప్పటిదాకా అనేక పోటీల్లో పాల్గొని అందరి మన్ననలు పొందాను. సాంప్రదాయ నృత్యం కాకుండా ప్రస్తుతం ఉన్న జనరేషన్, టెక్నాలజీ, ఫ్యాషన్ మేరకు వెరైటీ డ్యాన్స్‌పై ప్రత్యేక దృష్టి సారించాను. నాకు నా తండ్రి ఇనాయతుల్లా ఆదర్శం అయ్యాడు. మా నాన్న మంచి కళాకారుడు. అతని నుంచి వేష భాషలను నేర్చుకున్నా. అవి డ్యాన్స్‌లో మంచిగా ఉపయోగపడుతున్నాయి. నాకు గొప్ప సినీ కొరియోగ్రాఫర్ కావాలని ఉంది. తప్పకుండా అవుతాననే నమ్మకం ఉన్నది. మా లాంటి డ్యాన్సర్లకు ప్రభుత్వం ప్రోత్సాహం అందించాలి.

– ఎండీ సమీర్, డ్యాన్సర్

# సన్న బియ్యానికి రెక్కలు



- చిట్టిపొట్టి, చింట్లు రకాల రూ.6,300 వరకు అమ్మకం
- క్వింటాకు అదనంగా వెయ్యి రూపాయలకుపైగా పెరిగిన ధరలు
- ప్రస్తుతం ధాన్యం రూ.3వేల నుంచి రూ.3,400కు విక్రయం

## క్వింటా కొత్త బియ్యం రూ.5వేలు.. పాత బియ్యం రూ.5,500

నల్లగొండ, డిసెంబర్ 16 : సన్న బియ్యం ధరలు సామాన్యుడి అంచనాలు మించి మార్కెట్‌లో సన్నాయి మోత మోగుతున్నాయి. గడిచిన నాలుగైదేండ్లుగా ఏటా వానకాలం సీజన్‌లో మిల్లుల వద్ద క్వింటా బియ్యం రూ.3వేల నుంచి రూ.3500 వరకు దొరికేది. ఈ ఏడాది గత పరిస్థితులకు భిన్నంగా వాటి ధరలు మార్కెట్లో దర్శనమిస్తున్నాయి. రైస్ దుకాణాలతో పాటు మిల్లుల్లో ప్రస్తుతం బీపీటీ కొత్త బియ్యం క్వింటా రూ.4800 నుంచి రూ.5వేల వరకు అమ్ముతుండగా.. పాతవి (గత వానకాలం) రూ.5500కు పైగా అమ్ముతున్నారు. ఇక చిట్టిపొట్టి, చింట్ల రకాల ధాన్యం అయితే క్వింటా బియ్యం 6300 రూపాయలకు పైనే అమ్ముతున్నారు. గత ఏడాది ఇదే సమయంలో బీపీటీ, సన్నవి కొత్తవి క్వింటా రూ.3300 నుంచి రూ.3700 వరకు పలుకగా, పాతవి రూ.4వేల నుంచి రూ.4500 వరకు అందుబాటులో ఉండేది. నాలుగైదేండ్లుగా ప్రతి వానకాలం సీజన్‌లో ఈ పరిస్థితులు ఉండగా.. ఈ సారి అందుకు భిన్నంగా కొత్త బియ్యంతోపాటు పాతవి క్వింటాకు సగటున వెయ్యి రూపాయలు అదనంగా పెరిగినట్లు మార్కెట్ వర్గాలు అంటున్నాయి. ఎండబోసిన ధాన్యం క్వింటాకు రూ.3వేల నుంచి రూ.3400 వరకు ధర పలుకుతున్నది.



### వచ్చే వానకాలం నాటికి ఇంతకు మించి..

ప్రస్తుతం సన్న బియ్యం కొత్తవి అయితే క్వింటా రూ.5వేల వరకు, పాతవి రూ.5500, చిట్టి పొట్టి లాంటివి రూ.6300 దాకా అమ్ముతున్నారు. వచ్చే వానకాలం నాటికి వీటి ధరలు మరింత పెరిగే అవకాశం ఉన్నది. ఈ యాసంగి సీజన్‌లో సాగర్ ప్రాజెక్టులో నీళ్లు లేనందున ఆయకట్టుతోపాటు ఏఎమ్మార్పీ ద్వారా నీటి విడుదల ఉండదు. దాంతో ఈ యాసంగి సీజన్‌లో వరి సాగు తక్కువగా ఉండటంతోపాటు వేసవిలో భూగర్భ జలాలు కూడా ఇంకిపోయే ప్రమాదం ఉన్నది. దాంతో ప్రస్తుతం వరి సాగు చేసే రైతులు కూడా దొడ్డు రకాలు సాగు చేసే అవకాశం ఉంటుంది. మళ్లీ సన్న రకాల ధాన్యం సాగు కావాలంటే వచ్చే వానకాలం సీజన్‌పైనే ఆధారపడాల్సి ఉన్నది. ఫలితంగా అప్పటి వరకు సన్న బియ్యం ధరలు ఇంతకుమించి పెరిగే అవకాశం ఉండనుంది.

### తగ్గిన సన్నాల సాగు..

జిల్లాలో ఈ సారి సన్న బియ్యం ధరలు అమాంతం పెరుగడానికి పలు కారణాలు ఉన్నాయి. సాధారణంగా రైతులు ఎక్కువగా వానకాలం సీజన్‌లోనే సన్న వడ్లు సాగు చేస్తుంటారు. అయితే.. ఈ వానకాలంలో జిల్లాలో సన్న ధాన్యం సాగు గణనీయంగా తగ్గినట్లు వ్యవసాయ శాఖ యంత్రాంగం అంటున్నది. గత ఏడాది జిల్లాలో 5.04 లక్షల ఎకరాల్లో వరి సాగు కాగా, అందులో 3.20 లక్షల (63శాతం) ఎకరాల్లో సన్న రకాలు సాగు చేశారు. ఈ ఏడాది 5.05 లక్షల ఎకరాల్లో వరి సాగు అయినప్పటికీ అందులో 1.73 లక్షల ఎకరాల్లో (32శాతం) మాత్రమే సన్న రకం ధాన్యం సాగు చేశారు. గత ఏడాది వానకాలం సీజన్‌తో పోలిస్తే ఈ ఏడాది 31శాతం సన్న ధాన్యం సాగు తక్కువగా అయ్యింది. సాగు నీటి వనరుల కొరతే ఇందుకు కారణంగా తెలుస్తుంది. సన్న వరి సాగు కాలం కంటే దొడ్డు రకాల సాగు సమయం తక్కువ ఉండటం, నీటి వనరుల కొరతతో రైతులు తక్కువగా వేసినట్లు వ్యవసాయ శాఖ అధికారులు పేర్కొంటున్నారు.

### సన్న బియ్యం ధరలు బాగా పెరిగాయి



గత వానకాలం సీజన్ కంటే ఈ సారి సన్న రకం ధాన్యం మిల్లులకు చాలా తక్కువగా వచ్చింది. సాగు తక్కువగా అయినందున రైతులు తమకు కావాల్సినవి ఉంచుకొని మిగిలినవి మిల్లులకు తీసుకొచ్చి అమ్మారు. ఈ సారి చిట్టిపొట్టి వంటి సన్న రకం ధాన్యాన్ని క్వింటా రూ.3400 దాకా పెట్టి కొన్నాం. బీపీటీ కూడా రూ.3వేల వరకు నడుస్తున్నది. గతంలో మన ధాన్యం ఇతర ప్రాంతాలకు ఎగుమతి చేయగా.. ఈ సారి ఇక్కడే వీటికి బాగా డిమాండ్ ఉన్నది. సన్న ధాన్యం సాగు చేసిన రైతులకు బాగా కలిసి వచ్చింది.

– వెంకటరమణ, మిల్లర్, మిర్యాలగూడ

### క్వింటా బియ్యం రూ.5వేలు అంటున్నరు



ఈ మధ్యనే వానకాలం సీజన్ బియ్యం మార్కెట్‌కు వచ్చినయ్. బియ్యం కొందామని మార్కెట్‌కు వెళ్తే కొత్తవి రూ.5వేలు అంటున్నరు. ఇప్పుడే ఇంత ధరలు ఉంటే ఇంకో సీజన్ వచ్చేసరికి ఎట్ల ఉంటదో అని తెలిసి అప్పు చేసి నాలుగు క్వింటాళ్ల బియ్యం కొన్నా. పాత బియ్యం అయితే 5500 రూపాయలు అంటున్నరు. ఈ సారి ధరలు ఇట్ల పెరిగినయి ఏందని అడిగితే సన్న రకం వరి ఎక్కువ సాగు చేయలేదంటున్నరు. అయినా తినకుండ ఉండలేము కదా అని ముందే కొని పెట్టుకున్నం.

– కొయ్యగూర గణేశ్, వినియోగదారుడు, నల్లగొండ

### ఎప్పుడూ ఇంత పెరుగలేదు



నేను మంగళి వృత్తి చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నా. మాకు ప్రతి నెలా ఇంట్లో అర క్వింటా వరకు బియ్యం పడుతాయి. కొత్త బియ్యం అయితే అన్నం బాగ కాదని పాతవి మాత్రమే కొంటాను. ఈ నెల బియ్యం కొనేందుకు మార్కెట్‌కు పోతే గత నెల కంటే క్వింటాకు రూ.800 అదనంగా చెప్పారు. అంతకుముందు నెల క్వింటా బియ్యం రూ.5వేలకు కొన్నా. ఇప్పుడు రూ.5800 పెట్టి కొనుగోలు చేశా. నాకు వచ్చే కొద్దిపాటి ఆదాయానికి బియ్యం ధర పెరుగడం కొంత భారమే. గత పదేండ్లలో ఎప్పుడూ ఇంతగా పెరుగలేదు.

–పిన్నెల్లి వెంకటేశ్, సూర్యాపేట



అనుముల మండలం మదారిగూడెం వద్ద యాసంగి వరి నాట్లు వేస్తున్న కూలీలు

# ఓ వైపు వరి కోతలు.. మరో వైపు నాట్లు

## గ్రామాల్లో బిజీబిజీగా రైతులు, కూలీలు

హాలియా, డిసెంబర్ 16 : నాగార్జున సాగర్ నియోజకవర్గంలో రైతులు, కూలీలు సాగు పనుల్లో బిజీబిజీగా ఉన్నారు. వానకాలం ముగిసి యాసంగి సీజన్ ప్రారంభం కావడంతో గ్రామాల్లో రైతులు ఓ వైపు వరి కోతలు కోస్తుండగా.. మరోవైపు నాట్లు వేస్తున్న పరిస్థితి ఉన్నది. ఈ ఏడాది నాగార్జున సాగర్ ఎడమ కాల్వకు సాగు నీటిని విడుదల చేయలేమని, రైతులు క్రాప్ హాలిడే పాటించాలని ఎన్ఎస్‌పీ అధికారులు పేర్కొన్నారు. దీంతో బోరు బావులు ఉన్న రైతులు తిండి గింజల కోసం వరి సాగు చేస్తుండగా.. మరికొంత మంది మినుములు, నువ్వుల పంటలు వేశారు. గత ఏడాది యాసంగిలో సాగర్ నియోజకవర్గ రైతులు లక్షా 20వేల ఎకరాల్లో వరి సాగు చేయగా.. ఈ ఏడాది సాగు గణనీయంగా తగ్గే అవకాశం ఉన్నది.



అనుముల మండలం పేరూరు వద్ద వానకాలం వరి కోతలు

# పరమ పవిత్రం ధనుర్మాస వ్రతం

- నేటి నుంచి జనవరి 15 వరకు ధనుర్మాసోత్సవాలు
- జనవరి 14న గోదా రంగనాథుల కల్యాణోత్సవాలు
- వేడుకలకు ముస్తాబవుతున్న ఆలయాలు

శ్రీమహావిష్ణువుకు ప్రీతికరమైన మాసం ధనుర్మాసం. పరమ పవిత్రమైన ఈ మాసం ఆదివారం (ఈ నెల 17) ప్రారంభమవుతుంది. సంక్రాంతికి నెల రోజుల ముందు సూర్యుడు ధనురాశిలో ప్రవేశించడంతో ధనుర్మాసం ఆరంభమవుతుంది. తిరిగి సూర్యుడు మకర రాశిలోకి ప్రవేశించే సంక్రాంతి రోజుతో ముగుస్తుంది. ధనుర్మాసం ప్రారంభాన్ని పల్లెల్లో సంక్రాంతి నెల అంటారు. ఈ నెలలో అంతటా ఆధ్యాత్మిక శోభ సంతరించుకోనుంది. తిరుప్పావై ప్రవచనాలతో ఆలయాలు మార్మోగనున్నాయి. చివరి రోజు జనవరి 14న గోదా రంగనాథస్వామి కల్యాణోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించనున్నారు. నెల రోజుల పాటు ధనుర్మాస వ్రతాన్ని ఆచరిస్తే పుణ్యఫలం దక్కుతుందని భక్తుల నమ్మకం.

*– రామగిరి, డిసెంబర్ 16*

### ధనుర్మాస వ్రత విధానం

పన్నెండు మాసాలలో మార్గశిర మాసం చాలా గొప్పది. సూర్యుడి గమనాన్ని బట్టి చెప్పే సౌరమానం ప్రకారం మేషం నుంచి మీనం దాకా సూర్యుడు నెలకో రాశిలోకి ప్రవేశిస్తాడు. ఆ ప్రవేశమును సంక్రమణం అంటారు. సూర్యుడు ధనుస్సు రాశిలోకి ప్రవేశించడంతో ధనుర్మాసం ప్రారంభమవుతుంది. ఈ మాసంలో రోజూ తెల్లవారుజామున లేచి స్నానాలు చేసుకుని ఆండాళ్ అమ్మవారి చిత్రపటాన్ని పీట మీద పెట్టి పూలు, పూజా ద్రవ్యాలతో అలంకరించాలి. గోదా అష్టోత్తర శత నామాలతో అర్చన చేసి మొదటి రోజు టెంకాయ కొట్టి తీపి వంట నైవేద్యం ఉంచి హారతి ఇవ్వాలి. సాయంత్రం దీపారాధన చేసి వీలుంటే గోదా అష్టోత్తరం చదువాలి. ఇలా బోగి పండుగ వరకు 30 రోజులు వ్రతం చేయాలి. ఈ వ్రతం ఆచరించే వారు ఆండాళ్ అమ్మవారి ముప్పై పాశురములు (తిరుప్పావై) చదువాలి. బోగి రోజు తీపి వంట చక్కెర పొంగలిని ప్రసాదంగా సమర్పించాలి. వ్రతం ఆచరించే వారు ఒంటి పూట భోజనంతోపాటు సాత్విక ఆహారాన్ని తీసుకోవాలి.

### తిరుప్పావై ఇలా..

సాక్షాత్తు భూదేవి అవతారమూర్తి అయిన ఆండాళ్ రచించిన దివ్య ప్రబంధమే తిరుప్పావై. తిరుప్పావై అంటే శ్రీవ్రతం. ఈ వ్రతాన్ని తిరునోము అంటారు. తిరు అంటే మంగళకరం, పావై అంటే మేల్కొలుపు అని అర్థం. ఈ మాసంలో విష్ణువును మధుసూదనుడు పేరుతో పూజించి మొదటి 15 రోజులు చక్కెర పొంగలి లేదా పులగం నైవేద్యంగా సమర్పించాలి. తర్వాత 15 రోజులు దద్దోజనం అర్పించాలి. యువతులు తమ ఇండ్ల ముంగిట ముగ్గులు, గొబ్బెమ్మలతో పూజలు చేయడం వల్ల కోరిన వరుడు లభిస్తాడని నమ్మకం. ఈ నెలలో రోజూ సూర్యోదయానికి ఐదు గడియలు ముందుగా నిద్రలేచి తలస్నానం చేసి ధనుర్మాస వ్రతాన్ని ఆచరించాలని పురాణాలు చెబుతున్నాయి. మరో వైపు 30వ రోజు ఆధ్యాత్మికత చెందుతూ పాశురాలను ధ్యానం చేస్తే భగవత్ సంకల్పం ప్రాప్తిస్తుంది.



ఉత్సవాలకు ముస్తాబవుతున్న సూర్యాపేటలోని వేంకటేశ్వరస్వామి దేవస్థానం

### ముస్తాబైన రెండో భద్రాద్రి..

రెండో భద్రాద్రిగా పేరుగాంచిన నల్లగొండలోని రామగిరిలో గల సీతారామచంద్రస్వామి దేవాలయంలో ఈ నెల 16 నుంచి జనవరి 14వరకు ధనుర్మాస కార్యక్రమాలు జరుగనున్నాయి. రోజూ సాయంత్రం చిన్నజీయర్ స్వామి శిష్యులు ఉపన్యాస రత్న నల్లాన్‌చక్రవర్తుల రామకృష్ణమాచార్యులు తిరుప్పావై ప్రవచనాలు చేయనున్నారు. రోజూ తెల్లవారుజామున 3:30 గంటలకు ఆలయ ద్వారం తెరుచుట. 4గంటలకు సుప్రభాతం, 4:30కు మంగళవాయిద్యం, ఉదయం 5గంటలకు ఆరగింపు, 6:30కు తిరుప్పావై ఆధ్యాత్మిక ప్రవచనం, ప్రభాత సేవ నిర్వహిస్తారు. 7:30 గంటలకు అర్చనలు, 10:30కి ఆరగింపు, 11గంటలకు ద్వారా బంధనం చేస్తారు. సాయంత్రం 5:30కు సామూహిక విష్ణు సహస్ర పారాయణం, 6గంటలకు తిరుప్పావై ప్రవచనాలు, రాత్రి 7:30కు అమ్మవారి పల్లకీ సేవ, 8గంటలకు ఆరగింపు, 8:30కు ఆలయ ద్వార బంధనం చేయనున్నారు. ఈ కార్యక్రమాలు నిత్యం జరుగనున్నాయి.

### ధనుర్మాసోత్సవాల్లో ముఖ్యమైన కార్యక్రమాలు

ధనుర్మాసోత్సవాల్లో భాగంగా ఈ నెల 17నుంచి జనవరి 14వరకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. ఈ నెల 22న ముక్కోటి ఏకాదశి, ఉత్తర ద్వార దర్శనం. గోదా రంగనాయక స్వామి సహస్రనామార్చన, 26న ఆంజనేయస్వామికి సహస్రనామార్చన, 30న లక్ష్మీ వేంకటేశ్వర సహస్రనామార్చన, జనవరి 1న ఆంగ్ల నూతన సంవత్సరం, జనవరి 4న భగవత్ రామానుజాచార్య స్వామి సహస్రనామార్చన, జనవరి 7న సీతారామచంద్ర స్వామి సహస్రనామార్చన, జనవరి 9న తొండరడిప్పొడియాళ్వార్ తిరునక్షత్రం, 12న కుడారై ఉత్సవం, నిరాటోత్సవం, 12న నిరాటం, ఎదుర్కోలు, 13న నిరాటం, రాత్రి గోదారంగనాయక స్వామి ఎదుర్కోలు, 14న గోదా రంగనాయక స్వామి కల్యాణోత్సవం, 15న అమ్మవారి ఒడి బియ్యం, సాయంత్రం గోదారంగనాయకుల పవళింపు సేవ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు నల్లగొండలోని రామగిరి సీతారామచంద్రస్వామి ఆలయ ఈఓ టి.జయరామయ్య తెలిపారు.